

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కొండబిట్రగుంటలో పోటెత్తిన భక్తులు

**బిట్రగుంట, నవంబరు 18 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు దేవాలయంలో జరిగిన సహస్ర దీపాలంకరణ, ప్రత్యేక పూజలలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రంలో ఉచిత వైద్య శిబిరం



**ముత్తుకూరు, నవంబర్18, ప్రభాతవార్త** ఆదాని కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ఆదాని ఫౌండేషన్ శనివారం ముత్తుకూరు పంచాయతీ పరిధిలోని చలివేంద్రం గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిభిరంలో వైద్యుడు డాక్టర్ వైష్టవ్, అపోల్ ఫౌండేషన్ టోటల్ హెల్త్‌కి చెందిన డాక్టర్ ఎం. గాయత్రి, డెంటిస్ట్ కళ్యాణ్, హోమియోపతి డాక్టర్ సురేష్‌లు చిన్నారులు, పురుషులు, మహిళలు సహా 102మందికి పైగా రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదానీ ఫౌండేషన్‌కు చెందిన టి. రవీంద్ర, వార్డ్ మెంబర్ వెంకటేష్, డాక్టర్ సిహెచ్ రమేష్‌బాబు, షేక్. షాహుల్ హామీద్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

**వరికుంటపాడు, నవంబర్ 18, ప్రభాతవార్త :** అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అశోక్‌నగర్ లో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన షేక్ ఖాజామోహిద్దిన్(38)వ్యాపార నిమిత్తం వాహనాలను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆ వాహనాలకు కిస్తీ వాయిదాలు కట్టలేక గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



**కలువాయి నవంబర్ 18 ప్రభాతవార్త** మండలకేంద్రమైన కలువాయిలో వెలసియున్న శ్రీ ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీసమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయం నందు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి అమ్మవార్లకు విశేష అలంకరణ నిర్వహించారు. స్వామి వారికి అష్టోత్తర సహస్రనామ పూజా కార్యక్రమాలతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు పెద్దఎత్తున దూరప్రాంతాల నుండి తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తుల తీర్ధ ప్రసాదాలతోపాటు అన్న ప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది. నేడు శ్రవణానక్షత్రం పురస్కరించుకొని ఆలయంలో ఉండే శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి పంచామృతాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలను నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు నరసయ్య, స్వామి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి ఈకార్యక్రమం జరగనున్నందున భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని ఆలయ ప్రధానర్చకులు సోమశేఖర్ స్వామి కోరారు.

## కులగణనను చిత్తశుద్దితో నిర్వహించాలి



**కావలి, నవంబరు 18 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో, అంకితభావంతో చేపట్టాలని కావలి మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి బృందావనం హౌసింగ్ కాలనీ కళ్యాణమండపంలో శనివారం మున్సిపాల్టీ పరిధిలోని సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పొడుగాటి బెత్తం పట్టుకొని ఉపాధ్యాయుడుగా వ్యవహరిస్తూ కులగణనపై అవగాహన కల్పించారు. విమర్శలకు తావులేకుండా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఆటో ఢీ నలుగురికి గాయాలు

**విడవలూరు, నవంబర్18, ప్రభాతవార్త** విడవలూరు పార్లపల్లి మార్గం ఆంజనేయస్వామి గుడి వద్ద ట్రాక్టర్ ఆటో శనివారం ఢీ కొన్నాయి. నలుగురికి గాయాలైయ్యాయి. స్థానిక ఎస్సై ఆందజేయులు తెలిపిన వివరాల ప్రకారం అన్నారెడ్డిపాలెం నుండి ఆటోలో ఐదు మంది ప్రయాణిస్తున్నారు. విడవలూరు నుండి పార్లపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్ కేజెవెల్స్ ఆటోకి తగిలి నలుగురికి గాయాలైనట్లు తెలిపారు. వారికి చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి వెల్లడిస్తామని తెలిపారు.

## గ్రంధాలయంలో వ్యాసరచన పోటీలు

**విడవలూరు, నవంబర్18, ప్రభాతవార్త** విడవలూరు గ్రంధాలయంలో 56వ జాతీయ గ్రంధాలయ వారోత్సవం సందర్భంగా జడ్పిస్కూల్, అక్షరా స్కూల్ పిల్లలకు వ్యాసరచన పోటీల క్విజ్, చిత్రలేఖనం వంటి క్రీడా కార్యక్రమాలు శనివారం లైబ్రేరియన్ నిరూప ఆధ్వర్యంలో జరిగింది. పిల్లలు బాగా చదువుకుని మంచి స్థాయికి వెళ్లాలని అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నత స్థాయికి వెళ్లాలి, చదువుపట్ల మంచి జ్ఞానోదయం కలిగి ఉండాలి అదేవిధంగా లైబ్రెరిలో జ్ఞానం కలిగే పుస్తకాలు అందుబాటులో ఉంటాయి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. 60మంది పిల్లలు వ్యాసరచన పోటీలు పాల్గొన్నారు. అక్షర స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్, గృహిణి పద్మావతి, ఎన్జీవో శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీలకు వేగవంతంగా ఉపాధి పనులు కల్పించాలి

**విడవలూరు, నవంబర్18, ప్రభాతవార్త** జాతీమ మహాత్మా ఉపాధి హామీ పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఈసీ సోఫియా సుల్తాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని కోరిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని తదుపరి కూలీలకు కనీస వేతనం వచ్చే విధంగా పనులు జరిపించాలని సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా విడవలూరు సీనియర్ మేటు ఎస్సీ, ఎస్టీలకు ఎందుకు పనులు కల్పించడం లేదని ధ్వజమెత్తా రు. కూలీలకు వెంటనే పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు 20న

**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ మిషన్ విభాగం కింద ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీకి ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం పెంచలయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ ధరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫకేట్లను జతచేసి ఆరోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటలలోపు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ధరఖాస్తులు, ఇతర వివరాల కోసం ఎస్పీఎస్‌నెల్లూరు. ఏపీ. జీవోవి, ఇన్/నోటీసు/రిక్రూట్ మెంటు వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చున్నారు.

# మాటతప్పే చంద్రబాబును ప్రజలు నమ్మవద్దు



**నెల్లూరు సిటీ, నవంబర్18, ప్రభాతవార్త** ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చడంలో ప్రతిసారి మాట తప్పే చంద్రబాబును ప్రజలు నమ్మవద్దని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పొరపాటున జగన్మోహన్‌రెడ్డి కాకుండా చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజా సంక్షేమ పథకాలు 75శాతం ఆగిపోవడం ఖాయమని ఈ విషయాన్ని ప్రజలు జాగ్రత్తగా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. అన్ని సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా మహిళల ఖాతాల్లో జమచేసి మహిళా సాధికారతను సాధించిన ఘనత కూడా ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టాలను గురించి ఏ పథకం ప్రవేశపెట్టిన నేరుగా అకౌంట్‌లో నగదు జమ చేసిన చరిత్ర ఇంతవరకు దేశంలో ఎక్కడా లేదని, అటువంటి గట్టి నిర్ణయాన్ని తీసుకున్న తొలి వ్యక్తి సీఎం జగనన్న అని ఈ సందర్భంగా ప్రజలకు ఎంపీ తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రికి అండగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న తనకు మద్దతుగా ప్రజలు నిలవాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఇప్పటికే కోటి 50లక్షల రూపాయలతో రోడ్లు నిర్మించడం జరిగిందని, అదే విధంగా కోటి 58లక్షల రూపాయల నిధులతో సైడు కాలువల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. 29వ కార్పొరేషన్ డివిజన్‌లో వెంకటరెడ్డి నగర్‌లో 60లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం కొబ్బరికాయ కొట్టి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మాజీ డీసీసీబీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, నగర్ మేయర్ పొట్లూరి స్రవంతి, సీనియర్ నాయకులు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, హరిబాబు, స్థానిక కార్పొరేటర్ డాక్టర్ షేక్. సత్తార్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమలో విజయడైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కస్లర్ అధ్యక్షులు టీవీయస్ కమల్, జిల్లా ఈసీ మెంబర్ సూరిబాబు, కొండసాయిరెడ్డి, హరిబాబు, పట్టాభిరామిరెడ్డి, కడప ప్రభాకర్, జాకీర్, రంతుల్లా, ముజీబ్, అమర్, జాహిద్, అంజాద్, నిసార్, ఆనంద్, హాజరత్, పెంచలమ్మ, రమణయ్య, లక్ష్మీశారద, జ్యోతిరెడ్డి తదితరులతో పాటు డివిజన్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖలో వైసీపీ పెత్తనం పెరిగిపోయింది

**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** జిల్లాలో విద్యుత్ శాఖలో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ నేతల పెత్తనం పెరిగిపోయిందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న విద్యుత్ భవన్‌లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎస్‌ఈ విజయన్‌ని కలిశాడు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ మనుబోలు మండలంలో వీరంపల్లి సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా 9 ఏళ్ళుగా ఒక గిరిజన అబ్బాయి పనిచేస్తున్నాడని తెలిపాడు. అతను నిజాయితీగా పనిచేస్తున్నాడన్నారు. అయితే అక్కడ ఒక వైసీపీ నాయకుడు అతనిని తొలగించి వేరేవాళ్ళని అక్కడ పెట్టేందుకు ఇతనిని తొలగించేశాడన్నారు. ఇప్పటికి అతనిని తొలగించి వారం అయిందని, తొలగించడానికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే, ఎలాంటి కారణం చూపించకుండా తొలగించేశారని సోమిరెడ్డి మండిపడ్డాడు. అప్పటి నుంచి అతను తల్లి, భార్య, ఇద్దరు చిన్నబిడ్డలతో కలిసి నిరాహార దీక్ష చేస్తున్నాడన్నారు. నిరాహారదీక్ష చేస్తుంటే ఇక్కడ ఎస్‌ఈ, అక్కడ డిఈలు ఎందుకు నిరాహార దీక్ష చేస్తున్నాడో తెలుసుకోకపోవడం దారుణమని చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆ గిరిజన యువకుడిని తాను పరామర్శించేందుకు పోతే, అక్కడ మరో నిజం తెలిసిందని, రైతులు అడిగితే ఎల్‌సీ నాకు చెప్పకుండా ఎలా ఇస్తావని ఆ ఊరిపెద్ద సురేంద్రరెడ్డి ప్రతి విషయంలో కలుగుచేసుకుంటూ దురుసుగా ప్రవర్తిస్తూ, అసభ్యపదజాలంతో ఆయన ధాటికి తట్టుకోలేక, అక్కడ పనిచేస్తున్న గిరిజన యువకుడు జూనియర్ లైన్‌మ్యాన్ శ్రీకాంత్ 3నెలలు సెలవు పెట్టి వెళ్లిపోయినట్లు తెలిసిందన్నారు. అక్కడ ఏదిని ఎల్‌సీ కావాలంటే ఆ ఊరి పెద్ద సురేంద్రరెడ్డిని అడిగి రమ్మంటారంటారని సోమిరెడ్డి వివరించాడు. ఆ ఊరి పెద్ద సురేంద్రరెడ్డి విద్యుత్‌శాఖలో ఉద్యోగస్తుడాని ఆయన ప్రశ్నించాడు. ట్రాన్స్‌ఫార్మర్ కొత్తవి ఏమైనా వస్తే ఆయన ఫోను చేస్తే బిగించాల్సిన ట్రాన్స్‌ఫార్మర్‌ని ఎత్తుకెళ్ళిపోతారని సోమిరెడ్డి ఆరోపించాడు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సురేంద్రరెడ్డి చెపితేనే మార్చడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఆ ఊరి పెద్దరెడ్డులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మనుషులని ఆయన ఆగ్రహాన్ని వ్యక్తంచేశాడు. వైసీపీ నేతలకు మానవత్వం లేదని, ఇలాంటి వారు ప్రజా జీవితంలో మీరు ఉండేందుకు అనర్హులని సోమిరెడ్డి ధ్వజమెత్తాడు. గిరిజనుల ఉద్యోగాలను తీసేసేందుకు వీరు ప్రజాప్రతినిధులేనాని ప్రశ్నించారు. రాజకీయాల్లో ఉండేందుకు సిగ్గుండాలన్నారు. ఎస్‌ఈకి విషయాలన్నీ వివరించానని ఆ యువకుడి న్యాయం చేయకపోతే డిల్లీలోని ఎస్సీ కమిషన్‌కి పోతే చెప్పడం జరిగిందన్నారు. వెంటనే కలెక్టర్ ఏమి చేస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. ఏదిఏమైనా ఆ యువకుడికి న్యాయం జరగపోతే ఏ ఒక్కరిని వదలనని ఆయన హెచ్చరించాడు.

# ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు కలిసిరండి



**నెల్లూరు, నవంబరు18 ప్రభాతవార్త-విద్య** రానున్న ఎన్నికల్లో అధికార వైకాపాకు బుద్ధి చెప్పి జనసేన-తెలుగుదేశం పార్టీల ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు అందరూ కలిసి రావాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆయన జనసేన జిల్లా ప్రధానకార్యాదర్శి గనుకుల కిషోర్‌లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతు ఇరు పార్టీల కలయికను ప్రజలు స్వాగతిస్తున్నారని, ప్రజలకు నరకాని ్న చూపిస్తున్న వైకాపాను రానున్న ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఇందుకోసం అందరూ కృషిచేయ్యాలని పిలుపునిచ్చారు. గునుకుల కిషోర్ మాట్లాడుతు తమ అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు తెలుగుదేశం, జనసేనల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా సమస్యల సాధనకోసం పాటుపడతామని, ప్రజా ప్రభుత్వ ఏర్పాటుకు శక్తివంచన లేకుండా పాటుపడతామన్నారు. అనంతరం మాజీ మంత్రి నారాయణను జనసేన నేతలు శాలువాలు కప్పి భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వర్లు, ప్రశాంత్, పూసల మల్లేశ్వరరావు, తెలుగుదేశం నాయకులు కొండా ప్రవీణ్, సందీప్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 22 నుండి జరిగే ధర్మ ప్రచార వారోత్సవాలలో పాల్గొనండి



**బుచ్చి నవంబర్ 18 ప్రభాతవార్త** సనాతన ధర్మం పరిరక్షణార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహాయ సహకారంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమీషనర్ ఆదేశాలను అనుసరించి ధర్మ ప్రచార వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాలను శనివారం జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు, దేవదాయశాఖ సహాయక కమీషనర్ విరుపార్జుల గిరికృష్ణ పరిశీలించారు. ఈనెల 22 నుండి నవంబర్ 28 వరకు ధర్మ ప్రచార కార్యక్రమం వైభవంగా జరగనున్నట్లు తెలిపారు.

ఈ ధర్మ ప్రచార వారోత్సవాలు నవంబర్ 22 వ తేదిన కోవూరులోని శ్రీకామాక్షి సమేత శ్రీమల్లికార్జునసా ్వమి వారి దేవస్దానం ప్రాంగణం, నవంబర్ 23 బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్దానం, నవంబర్ 24 న కొడవలూరులోని రాజుపాళెంగ్రామ టపాతోపు సెంటర్ నందు, నవంబర్ 25న విడవలూరులోని శివాలయంలో నవంబర్ 26న నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండక్షేత్రంలోని శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్దానం ప్రాంగణం నందు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 27 వ తేదిన జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్దానం, నవంబర్ 28 వ తేది ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామంలోని శ్రీ చాముండేశ్వరీ అమ్మవారి దేవస్దానం ప్రాంగణం నందు ప్రతి రోజు శ్రీస్వామి అమ్మవార్లకు హోమం, అభిషేకం, కళ్యాణం, కుంకుమార్చన, కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. శ్రీస్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు విచ్చేయి భక్తులకు ఉచితప్రసాద వితరణ, త్రాగునీరు, ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో దేవస్దానం అర్చకులు, స్దానిక పెద్దలు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్దానం చైర్మన్ కేతరాజు కేశవరావు, ఇందుకూరుపేట మావూలూరు శ్రీనివాసులురెడ్డి, కొడవలూరు వీరిచలపతిరావు, విడవలూరు అచ్యుత్‌రెడ్డి, కోవూరు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

# తెల్లరాయి అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడులు



**సైదాపురం, నవంబర్ 18, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో ఉన్న ప్రభుత్వ పట్టా భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న తెల్లరాయి తవ్వకాలపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సైదాపురం ఎస్సై చల్లా వాసు మాట్లాడుతూ రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రాపూరు ఎస్సై మాల్యాద్రి, సైదాపురం పోలీసులు బృందంగా ఏర్పడి అక్రమ తెల్లరాయి తవ్వకాలపై దాడులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండా యంత్రాలతో తెల్లరాయి తవ్వకాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం రావడంతో దాడులు నిర్వహించి వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో నాలుగు ఇటాచి మిషన్లు, రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్, ట్రాలిని స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా వాసు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా యంత్రాల సహాయంతో ఖనిజ సంపద తవ్వకాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ గణేష్, నారయ్య, సిబ్బంది ఉన్నారు.

## గ్రంథాలయంలో విజ్ఞానదాయక పోటీలు



**కావలి రూరల్, నవంబరు 18 ప్రభాతవార్త** : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కావలి వెంగళరావునగర్‌లోని ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి ఎస్.సునీత ఆధ్వర్యంలో శనివారం విద్యార్థిని, విద్యార్థులకు విజ్ఞానదాయక పోటీలు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాధికారిణి సునీత మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విజ్ఞానదాయక పోటీలను గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని పొందాలని కోరారు. ఈ పోటీలలో విశ్వోదయ బాలుర, బాలికల పాఠశాలలు, గురుకుల పాఠశాల, నలంద పాఠశాల, తదితర పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది డి.ఈశ్వరయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

## నిరసన దీక్షను విజయవంతం చేయండి




**ఇందుకూరుపేట, నవంబర్18, ప్రభాతవార్త** : ఈనెల 20,21వ తేదీల్లో విజయవాడలో జరిగే 30గంటల నిరసన దీక్షను విజయవంతం చేయాలని సీపీఐ రైతు సంఘం కార్యదర్శి ఎస్కే షాన్వాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఇందుకూరుపేట సీపీఐ జెండా ప్రాంగణంలో వాల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్కే షాన్వాజ్ మాట్లాడుతూ కరువు కాటకాల నుండి ఆంధ్రప్రదేశ్‌ను కాపాడేందుకు రైతులకు మద్దతుగా విజయవాడలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు వెంటనే నీళ్ల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులపై చిన్న చూపు ఉందన్నారు. ప్రజాప్రతినిధులకు ఎక్కడ దోచుకోవాలన్నదే తప్ప ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశం లేదన్నారు. రాష్ట్రంలో ఇసుక, తెల్లరాయి, గ్రావెల్ వంటి వాటిపై దృష్టి పెట్టారు తప్ప.. పాలుకులు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇకనైనా మంత్రి హోదాలో ఉన్న కాకాని రైతులపై దృష్టి వారి సమస్యలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

## పారుదల కాలువలకు మోటార్లు వాడితే కఠిన చర్యలు తప్పవు




**తోటపల్లిగూడూరు, నవంబర్ 18, ప్రభాతవార్త** : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఏఈ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ఐఏబీ సమావేశంలో పెన్నా డెల్టా ద్వారా రబీ సీజన్లో సాగునీరు, తాగునీటి అవసరాలకు నీటిని 20వ తేదీన విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతాంగం రాజకీయాలకు అతీతంగా సమైక్యంగా నీటిని వాడుకోవాలని సూచించారు. మోటార్లు వాడితే కఠిన చర్యలు తప్పవని క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. నీటిని సక్రమంగా వినియోగించుకునేలా ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. రైతాంగం సమిష్టిగా విడుదల చేసిన నీటిని వృధా కాకుండా సాగునీరు, తాగునీటికి వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటి విడుదలకు సహకరించిన వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఈఈ నాగరాజు, డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏఈ ప్రసాద్, ఏవో శిరీష, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ఉదయగిరి జిల్లా సాధనకు ప్రతి ఒక్కరూ తరలిరండి




**ఉదయగిరి, నవంబర్18, ప్రభాతవార్త** : ఉదయగిరి మండలంలోని ప్రగతి కాలేజీలో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఉదయగిరి జిల్లా సాధన సమితి సభ్యులు డాక్టర్ వేణు పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరికి అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని కొంతమంది ఉదయగిరి కొరకు నీళ్లు, రోడ్లు, ఫ్యాక్టరీలు, ఇలా ఒక్కొక్కటిగా అడుగుతూ వచ్చారని వీటివలన సమస్యలు తీరకపోగా కాలయాపన వలన ఉదయగిరి ఇంకా నష్టపోయిందని తెలిపారు. విద్యార్థుల నుండి మేధావుల వరకు ప్రతి ఒక్కరిని సంఘటిత పరుచుకుని సమన్వయంతో అన్ని వర్గాల ప్రజల నుండి వివరాలు సేకరించి కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 30రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామని ప్రజలు చైతన్య వంతులై ఉద్యమంలో భాగస్వాములైతేనే మనమనుకున్నది సాధిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాధనకమిటీ సభ్యులు షేక్.దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు శిక్షణా తరగతులకు ఖచ్చితంగా హాజరుకావాలి



**ఉదయగిరి, నవంబర్18, ప్రభాతవార్త** : ఉదయగిరి మండలంలోని ఎంపిడివో కార్యాలయంలో నవంబర్ నెల 27వ తేదీ నుండి కులగణన సర్వేకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎంపిడివో డి.ఈశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శకునాలపల్లి, అప్పసముద్రం, తిరుమలాపురం ,నేలటూరు, ఉదయగిరి1, ఉదయగిరి2, ఉదయగిరి3, కొండయ్యపాలెం, సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు నవంబర్ 20వ మండల ప్రజాపరిషత్ కార్యాలయ పరిధిలో గత స్త్రీశక్తి భవన్‌లో శిక్షణా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అలాగే 21వ తేదీ ఉదయం జి.చర్లోపల్లి, వెంగల్‌రావునగర్, బనగానపల్లి, కృష్ణంపల్లి సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లుకు, శ్రీశక్తి భవన్‌లో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు జారీ చేసిన మెమో ప్రకారం ప్రతి ఒక్క సిబ్బంది ఖచ్చితంగా హాజరు కావాలని ఆమె తెలిపారు.

## శ్రీ మహావిష్ణువు,శ్రీ అయ్యప్ప ఆలయంలో ఐదవ రోజు అన్నదానాం

**రాపూరు, నవంబరు18ప్రభాతవార్త** : మండల కేంద్రమైన రాపూరులోని శ్రీశ్రీశ్రీ మహావిష్ణువు,శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న మండల కాల(41 రోజులు) అన్నదానం కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హజరైతున్నారు. అన్నదాన కార్యక్రమంలో ఐదవ రోజైన శనివారం ఉదయం స్వామి వారి ఆలయంలో ఉదయం ప్రత్యేక,పూజలు,భజనలు నిర్వహించి మద్యాహ్నం అయ్యప్ప స్వాములకు,గోవింద స్వాములకు, స్వామి వారి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీ మహావిష్ణువు ధ్వజస్థంబం వద్ద అకాశ దీపం వెలిగించిన అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు,భజనలు నిర్వహించారు. తదుపరి మాలాధారణ చేసుకున్న స్వాములకు రాత్రి బిక్ష కార్యక్రమం నిర్వహించారు. మద్యాహ్నం బిక్ష కార్యక్రమానికి దాతలుగా దివంగత రాపూరు యంపీపీ స్వర్గియ చెన్ను బాలకృష్ణా రెడ్డి జ్ఞాపకార్ధం వారి కుటుంబసభ్యులు,రాపూరు ఎస్బీ కానిస్టేబుల్ కూరాకు వరప్రసాద్ కుటుంబ సభ్యులు, సైదాపురం మండలం చీకవోలు గ్రామానికి చెందిన సింహా వివేక్ రెడ్డికుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాపూరు పోలీస్ సర్కిల్ ఇనస్పెక్టర్ సుబ్రమణ్యం,ఎస్ఐ మాల్యాద్రీలు పాల్గోని శ్రీ మహావిష్ణువు,శ్రీ అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలునిర్వహించారు. రాత్రి బిక్షను దివంగత రాపూరు యంపీపీ చెన్ను బాలకృష్ణా రెడ్డి జ్ఞాపకార్ధం వారి కుటుంభ సభ్యులు నిర్వహించారు. పెద్ద ఎత్తున స్వాములు,ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గోన్నారు.

## గుంతల రాజ్యం..ఎపి హెట్స్ జగన్ అంటు జనసేన నిరసన



**రాపూరు, నవంబరు18ప్రభాతవార్త** :గుంతల రాజ్యం..ఎపి హెట్స్ జగన్ అంటూ శనివారం వెంకటగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లు కార్యకర్తలతో కలసి రాపూరులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మద్దెలమడుగు సెంటర్‌లో గూడూరు వైపు వున్న గుంతలలో కార్యకర్తలతో కలసి నిరసన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గుంతల రాజ్యం..ఎపి హెట్స్ జగన్ అనే నినాధంతో రాష్టంలో రెండు రోజుల పాటు గుంతల రోడ్లపై నిరసన తెలిపి వాటికి సోషల్ మీడియా,ప్రచార మాద్యాలు,ఫెస్‌బుక్,ట్విట్టర్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. తద్వారా ఎపిలో రోడ్ల పరిస్థితిని ప్రతి ఒక్కరికి తెలియచేయడం జరుగుతుందని ఆయన సృష్టం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుండి ప్రతి సంవత్సరం జనసేన పార్టీ రోడ్ల మీద డిజిటల్ క్యాంపెయిన్ నిర్వహిస్తూ రోడ్డు మరమత్తులు చేయమని సోషల్ మీడియా వేదికగా నిరసన తెలియచేసుస్తున్నట్లు చెప్పారు. ప్రజల డబ్బుతో ప్రజలకు అవసరమైన రోడ్లు కూడా వేయడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కళ్ళు తెరిచి ప్రజా పాలన చేయాలని కోరారు. 2024లో జనసేన,తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కాయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ ఆధ్యక్షుడు పోట్టేళ్ల పెంచలయ్య, నాయకులు గంగిశెట్టి విజయ కుమార్, మేకల వేమయ్య, నివాస్,తదితరులున్నారు.

## గ్రంధాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం,వ్యాచరచన పోటీలు



**రాపూరు, నవంబరు18ప్రభాతవార్త** : జాతియ గ్రంధాలయ వారోత్సవాలలో బాగంగా శనివారం రాపూరు గ్రంధాలయంలో విద్యార్థులకు వ్యాచరచన,చిత్రలేఖనం,వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఉత్సాహంగా పాల్గోన్నారు.అనంతరం గ్రంధాలయ అధికారిణి జె. ధనమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్ధి గ్రందాలయానికివచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా విజ్ఞానం పెంపోందించుకోవచ్చని తెలిపారు.చిత్రలేఖనం, వ్యాచరచన,వక్తృత్వ పోటీలలో గెలుపోందిన వారికి గ్రంధాలయ వారోత్సవాలలో చివరి రోజు బహుమతులు ఆందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల ఉపాధ్యాయులు ఈశ్వర్, వెన్నెల, గ్రంధాలయం సహాయకుడు వెంకటేశ్వర్లు, విద్యార్థులు,పలువురు పాఠకులు వున్నారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీ నృసింహుని కళ్యాణం



**పెంచలకోన(రాపూరు), నవంబరు18ప్రభాతవార్త** : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణం శనివారంవైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా తెల్లవారుజామున స్వామి వారి మూలమూర్తికి అభిషేకం,పూలంగీ సేవ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు స్వామి వారి నిత్యకళ్యాణ మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులతో వేదపండితులు వేదమంత్రోచ్ఛరణలతో భాజభజంత్రీల మోతల మద్య శాస్రోక్తంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు, అనంతరం స్వామి వారికి సహస్ర్త దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గోని స్వామి,అమ్మవార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఇఒ,సిబ్బంది పర్యవేక్షించగా స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు రామయ్య స్వామి,పెంచలయ్య స్వామి, శశి స్వామి,మధు స్వామి,వినోద్ స్వామి, నాగరాజు స్వామి తదితరులు భక్తి శ్రద్దలతో నిర్వహించారు.

## రేషన్ వాహనాలపై నరేంద్రమోడి ఫోటో ఏర్పాటు చేయాలి



**ఆత్మకూరు, నవంబర్18, ప్రభాతవార్త** : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో రేషన్ ద్వారా ఇచ్చే ఆహార ధాన్యాలకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి నాయకత్వంలో నే కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 6వేల కోట్లు ఖర్చు చేస్తుందని అందువలన రేషన్ వాహనాలకు నరేంద్ర మోడి ఫోటో ఏర్పాటు చేయాలని భారతీయ జనతాపార్టీ యువమోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఆపార్టీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు సారధ్యంలో బిజెవైఎం నాయకులు ఆత్మకూరు తహసిల్దార్ ఎం.జగదీష్‌బాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.5కోట్ల రేషన్‌కార్డుల్లో 60శాతానికి పైగా అంటే 89లక్షల కార్డులకు రేషన్ ద్వారా ఆహారధాన్యాలు పూర్తిగా అందుతుంటాయన్నారు. మిగిలిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుందన్నారు. ఇందుకోసం ప్రతినెలా సుమారు 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అందుతున్నాయన్నారు. 2022-23 సంవత్సరానికి మాత్రమే ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 17లక్షల టన్నుల ఆహారధాన్యాలు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ సరుకులు ఇంటింటికి పంపే వాహనాలు మొత్తం 9260ఉన్నాయన్నారు. వీటిని 60శాతం సబ్సిడీతో ఎస్సీ, బిసి కార్పోరేషన్ల ద్వారా వాహనదారులకు అందించారన్నారు. ఈ సబ్సిడీతో 60శాతం నరేంద్రమోడి నాయకత్వంలోనే కేంద్ర ప్రభుత్వం అందజేసిందన్నారు. డిసెంబరు 2వ తేదీ లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 9260రేషన్ వాహనాలకు దేశప్రధాని నరేంద్రమోడి ఫోటో ఏర్పాటు చేయాలని అలా చేయని పక్షంలో తామే డిసెంబర్2తర్వాత ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బిజెవైఎం జిల్లా కార్యదర్శి జి.తిరుపతినాయుడు, బిజెపి సీనియర్ నాయకులు ఆళ్ళ మధుసూధన్, నగర ప్రధాన కార్యదర్శి సుమంత్‌రెడ్డి , నాయకులు శంకర్‌రావ్, బిజెవైఎం నాయకులు కిరణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 13 వవార్డులో సిమెంట్‌రోడ్డుకు శంకుస్థాపన



**బుచ్చి నవంబర్ 18 ప్రభాతవార్త** : బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని 13 వ వార్డులో గాంధీనగర్ యందు సాయిబాబాగుడికి వెళ్ళే మార్గంలో జొన్నవాడ దేవస్దానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు, 13 వవార్డు కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ సిమెంట్ రోడ్డుకు శంకుస్దాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 13 వవార్డు గాంధీనగర్ నందు సాయిబాబా గుడికి వెళ్ళే మార్గం వర్షాలకు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది, ఈవిషయం శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి తెలియజేయడంతో ఆయన రాజ్యసభసభ్యులు బీదామస్తాన్‌రావు సహకారంతో సిమెంట్‌రోడ్డు మంజూరు చేశారని అన్నారు. అలాగే నిధులు వచ్చేందుకు సహకరించిన చైర్‌పర్సన్ మోర్ల సు ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో బుచ్చిమున్సిఫల్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గోన్నారు.

## నిరుపేద గిరిజనులకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ




**కావలి రూరల్, నవంబరు 18 ప్రభాతవార్త**: టైంటూ హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నందిపాటి రమేష్ ఏకైక కుమార్తె నందిపాటి రిచిత పుట్టిన రోజు సందర్భంగా కావలి పట్టణం శివరామసుబ్బయ్య గిరిజనులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నందిపాటి రమేష్ శనివారం బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కుమార్తె నందిపాటి రిచిత పుట్టిన రోజు సందర్భంగా నిరుపేద గిరిజనుల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల బాధ్యులు రాయపాటి దిలీప్, సోమిశెట్టి బ్రహ్మయ్య, నందిపాటి ఆకాష్, సయ్యద్ ఘనీబాషా, రాయపాటి విచిత్, షేక్ ఖాదర్‌బీ తదితరులు రిచితకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

## అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న టిడిపి నేతలు



**కావలి, నవంబరు 18 ప్రభాతవార్త** : తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోట్లూరి శ్రీనివాసులు నివాసంలో శనివారం జరిగిన అయ్యప్పస్వామి పడిపూజ వేడుకలలో టిడిపి నేతలు, పట్టణంలోని అయ్యప్పస్వాములు, పలువురు ప్రముఖులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, టిడిపి నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, కావ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## డోర్ డెలివరీ సేవల వినియోగదారులకు చీరలు బహుకరణ



**కావలి, నవంబరు 18 ప్రభాతవార్త** :ఎపిఎస్ఆర్‌టిసి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న డోర్ డెలివరీ మాసోత్సవాలలో భాగంగా శనివారం కావలి కార్గో కేంద్రంలో లక్కీ డిప్ నిర్వహించి ముగ్గురు విజేతలకు విలువైన ఫ్యాన్సీ చీరల్ని బహుకరించారు. పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపార ప్రముఖులు ఐ.వి.సుబ్బారావు లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అల్లూరుకు చెందిన బి.గురుమూర్తి, పట్టణానికి చెందిన ఎస్.రవికుమార్, ఆర్.మణిలు బహుమతులు అందుకున్నారు. మాసోత్సవాలలో భాగంగా నాలుగు పార్సిళ్ళను బుక్ చేసిన వినియోగదారుల పేర్లలో ముగ్గురిని ప్రతి శనివారం లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి విలువైన బహుమతులు అందజేస్తామని డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మేడం రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ యం.రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ దాకారపు రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.కె.యం.మస్తాన్, వెంకటేశ్వర్లు, ఎస్.కె.కలాం, కె.వి.రమణయ్య, వస్త్రవ్యాపారి, టిడిపి నేత కటకం రాము, తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నేడే

**వింజమూరు, నవంబర్18, ప్రభాతవార్త** : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వింజమూరు మండల కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో జరుగుతుందని యుటిఎఫ్ ప్రతినిధి చెంచలబాబు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి నుండి ముఖ్య అతిథులు హాజరవుతారని ఈ సమావేశంలో ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ పరిణామాలపై కీలక చర్చలు జరుగుతాయన్నారు. కావున కార్యక్రమానికి యుటిఎఫ్ నాయకులు , కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు .

## వైభవంగా పల్లకి సేవ

**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త** : కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా భరత్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అఇక సంఖ్యలో పాల్గొన్నారు.

## దాడికి మాకు ఎలాంటి సంబంధం లేదు



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** : మున్వర్‌పై జరిగిన దాడికి మాకు ఎలాంటి సంబంధం లేదని, ఆయనకు మద్దతుగా తాము వెళ్ళామని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్ సోదరుడు అబ్దుల్‌జలీల్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో జలీల్ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల క్రితం మున్వర్‌కి కిషోర్‌కి భూ లావాదేవీల విషయంలో గొడవ జరిగిందన్నారు. మాకు ఫోన్ చేసి ముస్లింలను తిడుతున్నాడని, మీ అమ్మని బండ బూతులు తిడుతున్నాడని మమ్మల్ని రెచ్చగొట్టి మీరు ఇక్కడకి రమ్మని మున్వర్ కోరాడన్నారు. ఏమి జరిగిందో కనుక్కుందామని మున్వర్‌ని తీసుకుని కిషోర్ ఆఫీసుకి వెళ్ళామన్నారు. కిషోర్‌రెడ్డి లేకపోవడంతో మున్వర్‌ని వెళ్లిపోయామన్నారు. మరలా మున్వర్ మాకు ఫోన్ చేసి నన్ను కొట్టారని రమ్మంటే అక్కడికి వెళ్లే సరికి దెబ్బలతో మున్వర్ ఉన్నాడన్నారు. అతన్ని తీసుకుని తామే రూరల్ పోలీసుస్టేషన్‌కి వెళ్లి అక్కడ నుంచి జీజీహెచ్ వెళ్ళి, మెరుగైన వైద్యం కోసం అపోలోకి తరలించామని జలీల్ తెలిపారు. అపోలోలో మున్వర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కిషోర్‌రెడ్డిపై 324 కేసు నమోదు చేయాల్సిందేనని మున్వర్ హడావిడి చేశారన్నారు. అంతా చేసిన మున్వర్ ఒక కట్టు కథ అల్లి మీడియా ముందుకు వచ్చాడన్నారు. ముస్లిం సోదరుడిగా సహాయం చేయడానికి వెళితే ఇంతటి దుర్మార్గానికి ఒడిగడతాడని అనుకోలేదన్నారు. మాకు కిషోర్‌రెడ్డికి ఎటువంటి రాజకీయ, వ్యాపార లావాదేవీలు లేవన్నారు. వ్యాపారపరంగా మాకు చేసిన, జరిగిన అన్యాయాన్ని గతంలో ఎక్కడా ప్రస్తావించలేదు, ప్రస్తావించబోమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మావల్ల ఏదైనా సమస్య వచ్చిందా, ఏదైనా తప్పు చేశానా అనేది ప్రజలే గుర్తు చేసుకోవాలన్నారు. మాపై రాజకీయంగా ఎంత బురదచల్లినా ప్రజలు మమ్మల్ని నమ్ముతున్నారని ఆయన చెప్పారు. ఇబ్బందని ఏ ఒక్కరు మా గడప తొక్కినా సహాయాన్ని అందిస్తామని తెలిపారు. కిందిస్థాయి నుంచి కష్టపడి పైకివచ్చిన వాళ్ళ అక్రమార్జనతో వచ్చిన వాళ్ళం కాదని, ఆర్థికంగా నష్టపోయిన మాట వాస్తవమేనని, దేవుడిచ్చిన శక్తి సామర్థ్యాలు ఉన్నాయని తిరిగి పుంజుకుంటామని జలీల్ వివరించాడు.

## ప్రత్యేక అలంకరణలో వెంకయ్యస్వామి

**విడవలూరు, నవంబర్18, ప్రభాతవార్త** : మండలకేంద్రంలో వెలిసియున్న శ్రీ భగవాన్ వెంకయ్యస్వామికి శనివారం పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు,అర్చనలు,పూల అలంకరణలు చేశారు. అదే విధంగా ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో వెలిసిన వెంకయ్యస్వామి కూడా పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం కొర్నా సీనయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అంతకుముందు భజన భక్తమండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## 2న బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు



**బిట్రగుంట, నవంబరు 18 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండ బిట్రగుంటలో డిసెంబరు 2వ తేది నందమూరి బాలకృష్ణ జిల్లా అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక మాస వనభోజనాలకు నంద మూరి అభిమాన సంఘ కుటుంబ సభ్యులంతా తరలిరావాలని జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షులు వై.రవి పిలుపునిచ్చారు. మండల టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ ఎత్తున జరిగే ఈ వనభోజనాలకు నందమూరి అభిమాన సంఘాల కుటుంబాలు అందరు రావాలని వీరందరిని ఒక వేదిక మీదకు తీసుకొచ్చి వనభోజనాలలో పాల్గొనే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతకుముందు ఆయన వనభోజనాల ఏర్పాట్లపై కొండబిట్రగుంటలో పరిశీలించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన కావలి డివిజన్ ఎన్టీఆర్, బాలకృష్ణ అభి మాన సంఘాల అధ్యక్షులు భీమవరపు మధును ఆయన పరామర్శించారు. త్వరితగతిన భీమవరపు మధు అనారోగ్యం నుండి పూర్తి స్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. విలేకర్ల సమావేశంలో మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ప్రముఖ టివి కళాకారుడు సింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమాన సంఘాల నాయకులు నారా శ్రీనివాసులనాయుడు, కుంచాల శ్రీనివాసులరెడ్డి, మస్తానయ్య, కోడూరు వెంకటేశ్వర్లరెడ్డి, ఆవుల సురేష్, అశోక్, రావి విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్

**బిట్రగుంట, నవంబరు 18 ప్రభాతవార్త** బోగోలు మండలం విశ్వనాధరావుపేట బిట్-2 గ్రామ సచివాలయాన్ని మండల తహశీల్దార్ పసుపులేటి హేమంతకుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుతో పాటు పలు రికార్డులను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సిబ్బంది తప్పనిసరిగా ప్రతి రోజు సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని, డ్రస్ కోడ్ విదిగా అమలు చేయాలని సూచించారు.

## ఆదరణ కేంద్రంలో దుస్తుల పంపిణీ

**బిట్రగుంట, నవంబరు 18 ప్రభాతవార్త** మండలం ముంగమూరు భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో సాయిసేవకురాలు మానికల ఐశ్వర్య శనివారం అనాధలకు బట్టలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అనాధలకు తనవంతు సాయంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లుఆమె తెలిపారు. ఆదరణ కేంద్ర డైరెక్టర్‌కె.సింహాద్రిరావు, సాయి సేవకులు సాయిపూజిత, సుజిత్, సురేష్‌లు పాల్గొన్నారు.

## ఆవాస ప్రణాళికలు పారదర్శకంగా చేపట్టాలి




**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గానూ చేపట్టనున్న ఆవాస ప్రణాళికలను పారదర్శకంగా చేపట్టేలా మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమీక్ష నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలో ఏమైనా మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కావాలంటే ప్రణాళికల్లో నమోదు చేయాలన్నారు. ఈ ప్రణాళికలు 27వ తేది లోగా పూర్తిచేసి గ్రామ సభలు నిర్వహించి ఆమోదం పొందిన తర్వాత ఆ ప్రణాళికలను మండల విద్యావనరుల కేంద్రంలో అందజేయాలన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రాధారాణి, నరసింహమూర్తి, వెంకటేశ్వర్లునాయుడు, ప్రసాద్‌రెడ్డిలు పలు సూచనలు చేశారు.

## రాధన్న పరామర్శలు



**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** కోవూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న విజేత ఆంగ్ల మాధ్యమ పాఠశాల వ్యవస్థాపకులు దివంగత పడవల ప్రసాద్ సోదరి నిర్మలమ్మ శనివారం మృతిచెందారు. ఈ మేరకు కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని ఓదార్చి తన సానుభూతిని తెలియజేశారు.

## రేషన్ వాహనాలపై ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటం తప్పక ఉండాలి



**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఉన్న అన్ని రేషన్ వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్రపటం తప్పనిసరిగా ఉండాలని కోవూరు మండలం బీజేపీ అధ్యక్షుడు ఐ. రఘురామయ్య తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా బీజేపీ యువమోర్చా అధ్యక్షులు అశో క్, తదితరులు కలిసి తహసీల్దార్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఏటా ఇస్తున్న రేషన్‌కు కేంద్ర ప్రభుత్వం 1.5 కోట్ల రేషన్ కార్డులకు 6 వేల కోట్ల రూపాయలను అందజేస్తుందన్నారు. అదేవిధంగా 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. కేవలం 2022-23 సంవత్సరానికి కేంద్రం రాష్ట్రానికి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రేషన్ సరుకులు ఇంటింటికీ తీసుకెళ్లే వాహనాలు 9260 ఉన్నాయని, ఈ వాహనాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్‌ల ద్వారా 60శాతం సబ్సిడీతో వాహనాలను అందించడం జరిగిందని, ఈ 60 శాతం సబ్సిడీని కూడా కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ఈ విధంగా ఎన్నో పథకాలను కేంద్రం ఇస్తున్నా రేషన్ వాహనాలపై నరేంద్రమోడీ చిత్రపటం ఎందుకు ఏర్పాటు చేయలేదని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి నగేష్, ఉన్నారు.

## విద్యార్థులకు క్విజ్ పోటీలు



**వింజమూరు, నవంబర్18, ప్రభాతవార్త :** వింజమూరులోని గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు లైబ్రేరియన్ జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో క్విజ్‌పోటీలను నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు. ఆదివారం మహిళాదినోత్సవం, దిశ చట్టంపై అవగాహన , మహిళాసాధికారత పై చర్చ నిర్వహిస్తామన్నారు. ప్రధానో పాధ్యాయులు మాల కొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించిన ఎంపీ ఆదాల



**నెల్లూరు సిటీ, నవంబర్18, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండల ధనలక్ష్మీపురం గ్రామానికి చెందిన కోటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి అల్లుడు జి.శ్రీనివాసులురెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకరరెడ్డి ధనలక్ష్మీ పురంలోని కోటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆకస్మిక మరణం పొందిన శ్రీనివాసులురెడ్డి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కోటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులనుఓదార్చి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా పార్టీప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, జడ్పిటిసి సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, ఇరుకలల పరమేశ్వర దేవస్థానం చైర్మన్ శ్రీనివాసరావు, క్లస్టర్ 1అధ్యక్షులు ముడియాల రామిరెడ్డి, పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, పొట్లూరి జయవర్ధన్, కొండేటి శివారెడ్డి, తాళూరి సురేష్‌బాబు, దువ్వూరు గోపాల్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ పనులు పూర్తికావాలి



**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం నేతాజీనగర్‌లోని సదరన్ చానెల్ కాలువ ప్రాంతంలో ఉన్న పడుగుపాడు పైలెట్ ప్రాజెక్టు పైప్‌లైన్ ఇటీవల అకాల వర్షాలకు మరమ్మతులకు గురైంది. ఈ మేరకు ఆ ప్రాంతాన్ని శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఈ పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేలా పడుగుపాడు పంచాయతీ సర్పంచ్, జలజీవన్ మిషన్ చైర్మన్‌లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, జలజీవన్ మిషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తిలు ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో క్విజ్ పోటీలు



**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జనరల్ క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భగంఠ కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ ఎన్ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ విధమైన పోటీలు నిర్వ హించడం వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అధ్యాపకులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ శ్యామల కుమార్, మధుసూదన్‌రావు, డాక్టర్ అచ్యుతరావు, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ లావణ్య, డాక్టర్ శోభారాణి, డాక్టర్ విజయ్‌లు ఉన్నారు.

## లోకోస్ యాప్ డేటా త్వరితగతిన పూర్తికావాలి



**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న పొదుపు గ్రూపుల వివరాలను లోకోస్ యాప్ డేటాలో నమోదు చేసే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత గ్రా మాల వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాలని వెలుగు ఏపీఎం వెంకటస్వామి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో శనివారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు గ్రూపుల్లో అర్హత ఉన్న మహిళలకు మహిళా వ్యాపార వేత్తలుగా మార్చేందుకు అవసరమైతే బ్యాంకుల నుంచి రెండు లక్షల నుంచి 10 లక్షల వరకు రుణ సౌకర్యం అందించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా పొదుపు గ్రూపుల్లో అర్హత కలిగి ఉన్న ఎస్సీ ఎస్టీ మహిళలకు ఉన్నతి ద్వారా రుణాలు అందించేలా చూడాలన్నారు. వివిధ పథకాల నుంచి పొదుపు మహిళలు తీసుకుంటున్న రుణాలను తిరిగి క్రమం తప్పకుండా చెల్లించేలా వారిలో మరింత అవగాహన పెంచాలన్నారు. డబ్బులు అవసరమైన పొదుపు మహిళలకు వారి వారి పొదుపు ఖాతాలో ఉన్న నగదును అందించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వీవోఏల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో మండలంలోని అన్ని గ్రామాల వీవోఏలు ఉన్నారు.

## టీడీపీలో చేరిన 37వ డివిజను నేతలు



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** రూరల్ నియోజకవర్గ పరిధిలోని 37వ డివిజనుకి చెందిన కడప వినయ్, చేపూరు సుధారాణి, కడప శీను వారి మిత్రబృందం శనివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పసుపు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా టీడీపీ, జనసేన కూటమిలు అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. ఎక్కడికక్కడ అనేకమంది రాజకీయ కార్యకర్తలు, ప్రజా సంఘాలు, సేవా సంస్థలు పెద్దఎత్తున రూరల్ నియోజకవర్గంలో చేరుతున్నారని ఆయన అన్నారు. నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పఠాన్ సాబిర్‌ఖాన్, వడ్లమూరి రమేష్‌చౌదరి, న్యాయవాది వేణుగోపాల్‌నాయుడు, టిఎస్ శ్రీనాథ్, బండి రమేష్, నందిపాటి శ్యామ్, ఉన్నంమహేష్, మిద్దె శ్రీనాథ్, కార్తిక్, కత్తి సురేష్, మర్లపాటి శ్రీకాంత్, సురేంద్ర, గుణశేఖర్, అలీ, భాస్కర్, లోకేష్, అనుదీప్, హరిబాబు, సమద్, యాసిన్, వనజ, మాదవి, తిరుపతమ్మ, సహీన పాల్గొన్నారు.

## 19న ఉదయగిరిలో చంద్రన్న షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం



**ఉదయగిరి, నవంబర్18, ప్రభాతవార్త** మండలకేంద్రమైన ఉదయగిరిలోని చెంచల్‌బాబు గెస్ట్‌హౌస్ నందు 19తేదీ ఆదివారం చంద్రబాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఉదయగిరి తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, కష్టాలను, రాబోయే రోజుల్లో దూరం చేసే పథకమే చంద్రబాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అని తెలిపారు. ఉదయగిరి మాజీశాసనసభ్యులు బొల్లినేని రామారావు ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండలపరిధిలోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, శివ, తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో ఆస్తులపై పన్నులు వేస్తున్న ఏకైక పార్టీ వైసీపీ



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** దేశచరిత్ర ఆస్తులపై కూడా పన్నులు వేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మండిపడ్డారు. శనివారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో శ్రీనివాసులురెడ్డి విలేఖరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వస్తూనే ఇంటి పన్నులను పెంచేశారని, వెంటనే వాటిని రద్దు చేయకపోతే ఉద్యమాలతో ప్రభుత్వానికి కళ్ళు తెరిపిస్తామని హెచ్చరించారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్రం రూ.16వేలకోట్ల లోటుబడ్జెట్‌లో ఉన్నా ప్రజలపై ఎలాంటి పన్నులను విధించకుండా పరిపాలన చేశాడన్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతోనే నూటికి నూరు శాతం పన్నులను విధిస్తూ ప్రజల రక్తాన్ని జలగల్లా పీక్కుతింటోందన్నారు. అనిల్‌కి దమ్ముంటే ఇంటి పన్నుల పెంపుపై జగన్‌ని ప్రశ్నించాలని ఆయన డిమాండ్ చేశాడు. ఇంటి పన్ను నుంచి కరంటు బిల్లు, ఆర్టీసీ చార్జీలు దాకా పెద్దఎత్తున వైసీపీ దోపిడీ చేస్తోందని ఆయన విమర్శించాడు. పెంచిన చార్జీలు, పన్నులను రద్దు చేయకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాలకి శ్రీకారం చుడతామని శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. పిట్టి సత్యనాగేశ్వరరావు, కువ్వారపు బాలాజీ, కోకు మహేంద్రరెడ్డి అలియాస్ చిన్నబ్బయ్య, ఉచ్చి భువనేశ్వర్‌ప్రసాద్, ప్రశాంత్, జహీర్, పసుపులేటి మల్లికార్జున్, తల్లూరి శశికుమార్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కి వినతి పత్రం అందజేసిన బిజెపి నాయకులు

అల్లూరు, నవంబరు 18 ప్రభాతవార్త అల్లూరు తహశీల్దార్ చంద్రశేఖర్‌కు భారతీయ జనతా యువమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళూరు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ వాహనాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ బొమ్మని ఏర్పాటు చేయాలని యువమోర్చ రాష్ట్ర అధ్యక్షులు మిట్టా వంశీకృష్ణ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో తహశీల్దార్లకు వినతి పత్రాలు అందజేస్తున్నామన్నారు. రేషన్ పంపిణీలో 60 శాతంపైగా నిధులు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి బొమ్మ ఒక్కటే రేషన్ పంపిణీ వాహనాలపై వేయడం సొమ్ము ఒకడిది సోకు మరొకరిదిగా వున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చెంతాటి కృష్ణమోహన్, బిజెవైయం మాజీ ఉపాధ్యక్షుడు కిరణ్‌నాయుడు, మల్లికార్జునసింగ్, యువమోర్చ నాయకులు పాల్గొన్నారు.

## నిషార్ కుటుంబాన్ని పరామర్శించిన నారాయణ, అబ్దుల్‌అజీజ్



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని జెండావీధిలో శనివారం మృతి చెందిన సీనియర్ రాజకీయ నేత షేక్ నిషార్ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌అజీజ్‌లు పరామర్శిం చారు. నిషార్ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిషార్ కుటుంబానికి టీడీపీ తరపున తాము ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. వారితోపాటు 43వ డివిజన్ అధ్యక్షుడు జాకీర్, నన్నేసాహెబ్, మూసిద్ధిక్, ముసవీర్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ చిత్రపటాన్ని రేషన్ వాహనాలపై ఏర్పాటు చేయాలి



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-విద్య** జిల్లావ్యాప్తంగా ఉన్న రేషన్ వాహనాలపై ప్రధాని నరేంద్రమోడీ చిత్రఏటాన్ని ఏర్పాటు చేయాలని నగర రూరల్ తహశీల్దార్‌లకి ఆర్డీవోలకి భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు శనివారం వినతిపత్రాలని అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ వాహనాలపై మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధ్రీశ్వరి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ వినతిపత్రాల కార్యక్రమంలో భాగంగా నగర, రూరల్ నియోజకవర్గాల మండలాల తహశీల్దారులకు తాము వినతిపత్రాలను అందచేశామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని డిసెంబర్ 2లోగా పూర్తి చేయాలని లేనిపక్షంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో పెద్దఎత్తున మోదీ పోటోను ఏర్పాటు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్ళూరు నవీన్‌కుమార్, మురుగా నరేష్, ఉపాధ్యక్షులు సాయికృష్ణ, మదన్‌సాయిరెడ్డి, మాచిరాజు, తిరుపతినాయుడు, పృథ్వీయాదవ్, సందీప్, అశోక్, తిరుపతి జిల్లాల ఇన్‌చార్జులు లెక్కల రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రథమ చికిత్స శిక్షణలు



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ మీటింగ్ హాల్‌లో సీనియర్ ప్రొఫెషనల్, వొచర్ ప్రథమ చికిత్స శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ కమిటి సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, ఎంవి సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ గురునాథరావులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 19వరకు జరిపిన 35మంది శిక్షకులకు విజయవంతంగా అత్యవసర పరిస్థితుల్లో చేయవలసిన ప్రథమ చికిత్సలలో శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఏఓ సిహెచ్ చంద్రశేఖర్‌రావు, కోఆర్డినేటర్ జివి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో రోగులకు పండ్ల పంపిణీ



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** ప్రముఖ ఇంజనీరింగు కళాశాల గీతాంజలి ఇ న్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని దర్గా మిట్టలో ఉన్న సర్వజన ప్రభుత్వ పెద్దాసు పత్రిలో దాదాపు 350మంది రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగాఇ డా క్టర్ జి సుబ్బారావు మాట్లాడుతూ తమ కళా శాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది మెగా క్యాంపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేయడం, సామాజిక బాధ్యతతో చేపట్టామన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



**బుచ్చి నవంబర్ 18 ప్రభాతవార్త** నారా యణపురంలోని ప్రాథమిక పాఠశాలలో 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్స వా లు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చీదరాల చెన్నయ్య ఆధ్వర్యంలో విద్యార్దుకు వకృత్వం, చి త్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, ఆటలపోటీలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా చెన్నయ్య మాట్లాడుతు స్వాతంత్ర సమపార్జనలో గ్రంథాలయాలు ప్రముఖ పాత్ర పోషించాయని చెప్పారు. జీవితానికి వెలుగు, విజ్ఞానాన్ని, విద్యామాత్రమే అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఎంతో ఆలోచనతో గ్రంథాలయాలు ఏర్పాటు చేసిందని అన్నారు. గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. విద్యార్దులకు గ్రంథాలయ ఉద్యమకారుల జీవి తాలు, ,గ్రంథాలయలపై అవగాహన కల్పించేందుకు వివిధ రకాల అంశాలపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమ నిర్వహణ, న్యాయ నిర్ణేతలుగా మాజీ ఎంపిటిసి నకు ౭బాయమ్మ, విద్యాకమీటి మాజీ చైర్మన్ పిర్ల మాల్యాద్రి, యం గోవర్దన్, తదితరులు వ్యవహారించారు.

## డిస్‌కనెక్ట్ చేస్తామని ఫోన్ రాదు



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** విద్యుత్ బకాయిల పేరుతో వినియోగదారులకు మా సంస్థ నుంచి మీ సర్వీస్‌ని డిస్‌కనెక్ట్ చేస్తామని ఫోన్ కాల్ చేయమని, ఎస్ఎంఎస్‌లు, ఫోన్‌కాల్స్ చేసి నగదును దోచుకునే ఆన్‌లైన్ ముఠాలు చేసే పనులని. ఈ విషయాన్ని ప్రతి ఒక్క వినియోగదారుడు దృష్టిలో ఉంచుకోవాలని సూపరింటెండెంట్ ఇంజనీరు వి విజయన్ పేర్కొన్నారు. కరంటు బిల్లుల చెల్లింపుల విషయంలో ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులతో సమావేశం నిర్వహించారు. శనివారం విద్యుత్‌భవన్‌లో విలేఖరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు చేసేవారు మీ కరంటు బిల్లు బకాయి ఉందని మొదట ఎస్ఎంఎస్ పంపుతారని, తరువాత మీ కరంటు కట్ చేస్తామని, మీకు ఏమైనా సందేహాలు ఉంటే ఎలక్ట్రిసిటీ అధికారితో మాట్లాడమని ఒక నంబరు వాళ్ళది ఇస్తారన్నారు. మనం బిల్లు చెల్లించినా చెల్లించకపోయినా మెసేజ్ వస్తూనే ఉంటుందన్నారు. మీరు వారు ఇచ్చిన నంబర్‌కు ఫోన్ చేస్తే వారు ఎలక్ట్రిసిటీ అధికారిగా పరిచయం చేసుకుని మీకు ఒక లింకు పంపిస్తామని దాని ద్వారా బకాయి చెల్లించవచ్చని నమ్మబలుతారన్నారు. చెల్లించిన తరువాత బ్యాంకు నుంచి మీ నగదు డ్రామా అయినట్లు మేసేజ్ వచ్చే వరకు మీరు మోసపోయినట్లు తెలియదన్నారు ఆ తరువాత పోలీసు కంప్లైంట్ ఇచ్చిన లాభం ఉండదన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని తగు జాగ్రత్తలతో బిల్లు చెల్లింపులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ప్రతి విద్యార్థి గ్రంధాలయానికి వెళ్లాలి
## రాష్ట్రపతి అవార్డు గ్రహీత సిహెచ్ వెంకటనారాయణ



**బుచ్చి నవంబర్ 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం లోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో 56 వ జాతీయ గ్రందాలయ వారోత్స వాలలో భాగంగా పాఠశాల గ్రంధాలయ పుస్తకాలు ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత విశ్రాంత ఉపాధ్యాయులు సిహెచ్ వెంకట నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు నేడు పుస్తకాలు మంచి మిత్రుడని ,పుస్తకం హస్తభూషణం అని పెద్దలు చెప్పారని అన్నారు. ఈ పాఠశాలలో 1300 పుస్తకాలు ఉండడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఈ పుస్తకాలను ఉపయోగించుకుంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్ధితికి వెళతారని అన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు ప్రతి సంవత్స రం ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తామని విద్యార్థులు మన స్కూల్ల్ ఉన్న పుస్తకాలను చూసి వాటిని చదవడం జరుగుతుందని అలాగే ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఉపయోగపడే కొత్త పుస్తకాలు తీసుకొని వస్తున్నట్లు ఆయన తెలిపారు. పుస్తకాలలో శతకాలు, పెద్దబాలశిక్ష, వివేకానంద సాహిత్యం, ఆద్యాత్మిక గ్రంధాలు, దేశ నాయకుల జీవిత చరిత్ర, ఇంగ్లీషు పుస్తకాలు ఇలా అనేక పుస్తకాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రంధాలయంలోని వ్యాసాల పుస్తకాలను ఉపయోగించుకుంటారని, లీజర్ పిరియడ్‌లో విద్యార్థులు గ్రంధాలయంలోని పుస్తకాలు ఉపయోగించుకుంటుంటారని అన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు అనిత, సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్పస్వామి మెట్లపూజ,భజనలు



**బుచ్చి నవంబర్ 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శాంతినగర్‌లోని బృందావనం వీధిలో వైభవంగా అయ్యప్పస్వామి మెట్లపూజ, భజనలు నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌లోని స్వాములే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల స్వాములు కూడా ఈ మెట్ల పూజలు పాల్గొన్నారు. బృందవనం స్టీటల్ అయ్యప్పనామసంకీర్తనలతో మారు మ్రోగింది. భజనపూర్తి అయిన వెంటనే మెట్ల పూజ నిర్వహించారు. ప్రతి మెట్టుకు అయ్యప్ప శరణాలు చెబుతు కర్పూరం వెలిగించారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వాములకు పెద్దఎత్తున భిక్ష ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమ నిర్వాహకులుగా రావుల ప్రసాద్‌గౌడ్, పర్వతాల అశోక్‌గౌడ్, పెద్దమాల జగన్మోహన్‌గౌడ్, తాళ్ల వెంకటేశ్వర్లు గౌడ్, తాళ్ల లక్ష్మీనారాయణగౌడ్, నెల్లూరు శ్రీనివాసులురెడ్డి, రావుల సాయి సంతోష్‌గౌడ్, పెద్దమాల కృష్ణాగౌడ్, పెద్దమాల వివేక్‌గౌడ్, నెల్లూరు సాయిరెడ్డి తదితరులు బృందావనం గౌడ సంఘం ఆద్వర్యంలో ఈకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున స్వాములు పాల్గొన్నారు.

## కుంగిన నరుకూరు బ్రిడ్జి



**తోటపల్లిగూడూరు, నవంబర్ 18, ప్రభాత వార్త** మండలంలోని నరుకూరు రోడ్డు మార్గంలో ఉన్న ఆర్అం డ్‌బి బ్రిడ్జి కుంగి పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దాదాపు 20సంవత్స రాల కిందట నిర్మించిన ఈ వంతెనపై నిత్యం రాకపోకలు అధికంగా ఉంటాయి. తోటపల్లి గూడూరు మీదుగా వచ్చే వాహ నాలు కూడా ఈ వంతెన పైనే రావాల్సి ఉంటుంది. ఇటీవల కాలంలో భారీ టిప్పర్లు అధికంగా తిరగడంతో వంతెన కుంగడం జరిగిందని స్థానికులు ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రెండు బిట్లుగా ఉన్న ఈ వంతెన బ్రిటీష్ కాలం నాడు కట్టినది. పటిష్టంగా ఉండగా, ప్రస్తుత ఉన్న బ్రిడ్జి కుంగడం పట్ల ఆశ్చర్యం వ్యక్తపరిచారు. ఇరిగేషన్, ఆర్అండ్‌బి అధికారులు తక్షణం స్పందించి ఈ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. అయితే పక్కనే ఉన్న ఇటుకరాయి బ్రిక్స్ కంపెనీకి నిత్యం అధిక లోడ్‌లతో లారీలు వస్తూ పోతూ ఉంటాయి. అదే విధంగా అక్రమ మట్టి రవాణా జరుగుతున్న నేపధ్యంలో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు వాపోతున్నారు.

## అవినీతి,అక్రమాలే లక్ష్యంగా జగన్‌రెడ్డి పాలన



**దుత్తలూరు, నవంబర్ 18, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి, ఇబ్బందులకు గురి చేసిన ప్రతి ఒక్కరి లెక్క తేల్చి అంతకు మించి డబుల్ ఇస్తాననీ, అవినీతి, అక్రమాలే లక్ష్యంగా జగన్‌రెడ్డి పాలన సాగుతుందంటూ ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమము లో పాల్గొన్న మాజీ శాసన సభ్యులు బొల్లినేని రామారావు, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు వికాష్ హరికృష్ణ లకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన కార్యక్రమములో బొల్లినేని రామారావు మాట్లాడుతూ అక్రమంగా, అన్యాయంగా మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ను అరెస్టు చేయించారనీ, దేశ విదేశాల నుండి సైతం చంద్రబాబుకు సంఘీభావం తెలిపారనీ, అలాగే హైదరాబాద్ లో ఐటి ఉద్యోగులు లక్ష మంది బాలయోగి స్టేడియంలో చంద్రబాబుకు అక్రమ అరెస్టుకు నిరసన తెలిపారనీ, ఈ విధంగా దేశంలో ఏ నాయకుడికి సంఘీభావం రాలేదనీ, చంద్రబాబు మచ్చ లేని మహానుభావుడు కాబట్టే అందరూ అండగా నిలబడ్డారన్నారు. చంద్రబాబు జైలుకు పోయిన తరువాతే ఆయన చేసిన మంచి పనులు ప్రజలందరూ గుర్తు తెచ్చుకోని, తోడుగా నిలబడ్డారన్నారు. దుర్మార్గుడు జగన్‌మోహన్ రెడ్డి ఈ రాష్ట్రానికి మూడు రాజధానులు కడతానని ప్రగల్భాలు పలికి ఒక్క రాజధానని కూడా కట్టేందుకు నీకు దిక్కు లేదంటూ ఎద్దేవా చేశారు. పోలవరాన్ని ముంచేశావనీ, మద్యంలో 15 వేల కోట్ల ను దోచుకుంటున్నావనీ విమర్శించారు. నాశిరకం మద్యం అమ్ముతూ రాష్ట్రంలో 5 లక్షల మంది ప్రాణాలు తీసావంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్మార్గుడు వాళ్ళ నాయన ఉన్నప్పుడు లక్ష కోట్ల దోచుకుంటే, ఇప్పుడు మరో లక్ష కోట్లు దోచుకుంటున్నారన్నారు. చంద్రబాబు ప్రజలకు ఇసుక ఫ్రీగా ఇచ్చారనీ కేసులు పెడుతున్నావ్ మరి మీ నాయన ఆనాడు ఉచితంగా కరెంటు ఇచ్చారు కదా, అలాగే నువ్వు కూడా రోజుకో బటన్ నొక్కుతున్నావ్ కదా మీ పైన కేసులు పెట్టాలి కదా అంటూ నిలదీశారు. నెల్లూరు జిల్లా లో ఫారెస్టులో ఉన్న జామాయిల్ చెట్ల ను తక్కువ రేటుకు టెండర్ పాడుకొని, మూడు వందల కోట్ల రూపాయలను, నువ్వు నీ మినిస్టర్ పెద్దిరెడ్డి రామాచంద్రారెడ్డి దోచుకున్నారు అనీ విమర్శించారు. ఇసుక, మట్టి, మద్యం, ఆఖరికి బర్రెలను కూడా వదలకుండా అందులో 2800 కొట్ల రూపాయలను దోచుకున్న దుర్మార్గుడు, అవినీతి పరుడు జగన్ అంటూ ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. ఉదయగిరి లో ఓ పెద్ద మనిషి, ఎలాంటి పదవులు లేకుండానే పోలీస్ ఎస్కార్డుతో వస్తూన్నారనీ మేకపాటి రాజగోపాల్ రెడ్డిని విమర్శించారు. వాలంటీర్ల కు ఎవ్వరు బయపడవద్దని, వాళ్ళ జోబుల్లో నుండి ఏమి ఇవ్వటం లేదు అంటూ వాలంటీర్లు ను విమర్శించారు. అక్రమంగా కేసులు పెట్టినా బయపడవద్దనీ, టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత అంతకు రెండింతలు ఇస్తానని అన్నారు. ఇప్పుడూ ఎవ్వరు అయితే మన పై కేసులు పెడుతున్నారో వారి లెక్కలు తేలుస్తానంటూ వైకాపా నేతలను హెచ్చరించారు. ఉదయగిరి నియోజక వర్గంలో వేలకోట్ల తో అభివృద్ధి చేశానని, అలాగే తిమ్మాపురం గ్రామంకు రెండు చేయిస్తే ఈ పనికిమాలిన ప్రభుత్వం ఆ నిర్మాణాన్ని తుంగలో తొక్కివేసిందన్నారు. అనంతరం బాబు ష్యూరిటి-భవిష్యత్తుకు గ్యారెంటి కార్డులను అందజేశారు. అలాగే ఎన్ఆర్ఐ ఆధ్వర్యంలో బొల్లినేని రామారావు, పరిశీలకుడు వికాస్‌హరికృష్ణ లను పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో మాజీ ఎంపిపి శ్రీకుర్తి రవీంద్రబాబు, టిడిపి మండల కన్వీనర్ సింగవరపు సుబ్బారెడ్డి, క్లస్టర్ ఇనచార్జి కండ్లగుంట వెంకటరెడ్డి, ఎంపిటిసి సభ్యుడు దయానందం, గ్రామకమీటీ అధ్యక్షుడు సుబ్బారావు, మాజీ వైస్ఎంపీపీ బండారు సుశీల, నాయకులు కుంకు వెంకటయ్య, హనువంతునాయుడు, బండారు వెంకటేశ్వ ర్లు, దారపనేని తిరుపతయ్య, కొత్తపేట ఐటిడిపి కో ఆర్డినేటర్ వెంగళరావు. కాకర్ల మధుసూధన్‌రెడ్డి, చల్లా ప్రసాద్, నాగేశ్వరరావు, తులసిరామ్, బాలమురళి, బసవయ్య, చప్పిడి హజరత్తయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు



**కోవూరు, నవంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో డిసెంబర్‌లో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సంబంధించి పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఫిజికల్ డైరెక్టర్లు చేపట్టారు. మొత్తం ఈ ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో షటిల్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు సంబంధించి మండలంలో ఎంపిక చేసిన పాఠశాలల క్రీడా మైదానాల ఫోటోలు, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని సంబంధిత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు చేపట్టారు. ఏయే పోటీలు, ఏయే క్రీడా మైదానాల్లో నిర్వహించాలి అనే విషయాలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు దేవిక, సిరాజుద్దీన్, డెలీలా, రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

## ఉదయగిరి సామాజికి ఆరోగ్య కేంద్రంలో స్వీపర్‌పై సస్పెషన్ వేటు



**ఉదయగిరి, నవంబర్18, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వీపర్‌గా పనిచేస్తున్న యేసురత్నం అనే ఉద్యోగి కట్లుకట్టు గదిలో తన స్నేహితులతో కలిసి మందుతాగుతూ అధికారులకు చిక్కడంతో అతనిపై సస్పెషన్ వేడు వేశారు. గతంలో గోపి అనే సెక్యూరిటీ యాక్సిడెంట్ అయిన 4సంవత్స రాల బాలుడికి వైద్యం అందించిన దారుణ మైనఘటన మరువక ముందే గంగవరం గ్రామానికి చెందిన యిస్రాయిల్ అనే వ్యక్తికి మధమేహం వ్యాధితో శరీరం దద్దుర్లు రాగా డాక్టరు రాసిన ఇంజక్షన్‌కు బదులు యాంటి ర్యాబిస్ ఇంజక్షన్ సిబ్బంది ఇవ్వడం చర్చనియాంశమైంది. ఇలాంటి ఘటనలు మరువక ముందే దాసరిపల్లికి చెందిన ఖాజాఅహ్మద్ అనే వ్యక్తి తన కాలికి శస్త్ర చికిత్స జరిగిన పిమ్మట ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి డ్రస్సింగ్ కోసం రావడం జరిగిందని, యేసురత్నం అనే స్వీపర్ 200ఇస్తే గానీ డ్రస్సింగ్ చేయనని బాధితుడు తెలిపాడు. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులకు బదులు నర్సులు, నర్సు లకు బదులు కాంపౌండర్లు, వాచ్‌మెన్‌లు, స్వీపర్లు రోగులకు వైద్యం చేయడం పరిపాటిగా మారిందని ఆసుపత్రికి వస్తున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి డిసిహెచ్ ఎన్. రమేష్‌నాథ్ మాట్లాడుతూ సదరు ఉద్యోగిపై విచారణ జరిపామని జరిగిన సంఘటన వాస్తవమేనని అందుకు అతనిని సస్పెండ్ చేశామని తెలిపారు. క్షేత్రస్థాయిలో జిల్లా స్థాయి అధికారులు లోతుగా విచారణ జరిపితే ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరిన్ని లోటుపాట్లు వెలికివస్తాయని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## 167బిజి జాతీయ రహదారి పనులకు శంకుస్థాపన



**ఉదయగిరి, నవంబర్18, ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని కుర్రపల్లి గ్రామంలో దుత్తలూరు నుండి ఉదయగిరి మీదుగా సీతారామపురం వరకు 36కిలో మీటర్ల హైవే రహదారిని నిర్మిస్తున్న క్రమంలో భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైవే అథారిటీ డిఈ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పనులు మొదలుపెట్టిన సంవత్సరం లోపు నిర్మాణం పూర్తి అయ్యేలాగా ఎమ్ఆర్‌జిఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. 364కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాస్తున్న ఈ జాతీయ రాహదారిలో 14బ్రిడ్జిలు, దుత్తలూరు వద్ద 1ప్లైఓవర్ నిర్మిస్తామని తెలిపారు. హైవే నిర్మాణంలో భూమి కొల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు సంబంధిత మండలాల తహశీల్దార్ల వద్ద ఆయా రైతులు తమ భూమిహక్కు పత్రాలను, బ్యాంక్ పాస్‌బుక్‌లను సమర్పించవలసిందిగా ఆయన కోరారు. హైవే నిర్మాణంలో ఎవరికైనా నష్టపరిహారం చెల్లించాల్సి వస్తే తగిన పత్రాలతో తమ దృష్టికి తీసుకుని రవాలని జాతీయ రహదారి ప్లాన్‌ను ఎట్టిపరిస్థితుల్లో మార్చడం వీలుకాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ ఎమ్ ఆర్‌జిఆర్ కంపెనీ కాంట్రాక్టర్లు ముత్యాల రామగోవిందరెడ్డి, శ్రీ నివాసులురెడ్డి, చంద్రమోహా న్‌రెడ్డి ,ఉదయగిరి మండల వైసీపీ కన్వీనర్ గానుగుపెంట ఓబుల్‌రెడ్డి, పుల్లాయపల్లి కృష్ణారెడ్డి, పాముల రమణయ్య, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ తల్లి విగ్రహాప్రతిష్టలో నేతలు



**సీతారామపురం నవంబర్ 18 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని పోకలవారిపల్లి గ్రామం నందు ఈనెల 16 వ తేది నుండి నిర్వహిస్తున్న పోలేరమ్మ సహిత పోతురాజు విగ్రహాప్రతిష్టా ఉత్స వాలలో భాగంగా శనివారం నిర్వహించిన గ్రామోత్స వంలో మండల టిడిపినాయకులు చింతల శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఉదయగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పోలేరమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా నియోజకవర్గ స్థాయిలోని టిడిపి, జనసేన, వైసిపిలకు చెందిన నాయకులు, పలువురు అధికారులు పోలేరమ్మ ఉత్స వాలలో పాల్గొని అమ్మవారిని దరి్శంచుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్స వంలో పాల్గొన్న అతిధులకు గ్రామ కమీటి సభ్యుల చేత శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. శనివారం రోజున ప్రతిష్ట హోమాలు, విగ్రహాప్రతిష్ట, శిఖర కలశప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, పరిహారం, గోదర్శనం, జ్వాల దర్శనం, శిఖర కలశ కుంభాభిషేకం, పూర్ణాహుతి, మంగళహారతి తీర్ధ ప్రసాదాలు, మధ్యహ్నం సీతారామ చంద్రస్వామి వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ మన్నెటి వెంకటరెడ్డి, జనసేన నియోజకర్గ పరిశీలకులు, కొట్టే వెంకటేశ్వర్లు, మాజీ జడ్‌పిటిసి కలవెల జ్యోతి, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి బాగ్యమ్మ, టిడిపినాయకుడు గాజుపల్లి చంద్రారెడ్డి, పంచాయితీరాజ్ డిఇ సుబ్బారెడ్డి, జనసేన నియోజకవర్గంనాయకులు బోగినేని కాశీరావు, అల్లూరు రవీంద్ర, నేలూరు జాషువా, టిడిపినాయకులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే జగనన్న ధ్యేయం

కావలి, నవంబరు 18 ప్రభాతవార్త అర్హులైన వారందరికి సంక్షేమ పథకాల ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని 12వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల కరపత్రాల్ని పంపిణీ చేసి అవగాహన కల్పించారు. రాష్ట్రం ఎన్నో ఇబ్బందుల్లో వున్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాల ఫలాలు అందజేస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్న చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. రానున్న ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్‌కుమార్, 12వ వార్డు ఇన్‌చార్జులు చేవూరు కిరణ్‌కుమార్, దావులూరి శ్యాంసన్, అక్కిలిగుంట మాల్యాద్రి, వైసిపి నేత చెన్నుప్రసాద్‌రెడ్డి, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది...తుమ్మలపెంట రోడ్డులో నిరసన ప్రదర్శన



**కావలి, నవంబరు 18 ప్రభాతవార్త** తెలుగుదేశం, జనసేన పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో కావలి పట్టణ తుమ్మలపెంట రోడ్డులో శనివారం సాయంత్రం 'గుంతల ఆంధ్రప్రదేశ్‌కు దారేది' అన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి, జనసేన పార్టీల నేతలు నిరసన నినాదాల ప్రదర్శన చేపట్టారు. రోడ్లు వేయలేని సియం దిగిపోవాలి, చేతగాని ప్రభుత్వం గద్దెదిగాలి అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడారు. రహదారులు నిర్మించలేని దుస్థితిలో వైసిపి ప్రభుత్వం వుందన్నారు. చెత్త మట్టి వేసి గుంతల్ని పూడ్చలేని దుర్మార్గపు పాలన సాగిస్తున్నారన్నారు. తీర ప్రాంత గ్రామాలకు ఆయువుపట్టుగా మారిన తుమ్మలపెంట రోడ్డును నిర్మించాలంటూ పలుమార్లు నిరసనలు, ధర్నాలు నిర్వహించడం జరిగిందన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి సహజ సంపదను దోచుకోవడం తప్ప మరొక ధ్యాస లేదని దుయ్యబట్టారు. అధికారులైనా వెంటనే స్పందించి తీర ప్రాంత మత్స్యకారులు, పట్టణ ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా గుంతలు పూడ్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల దుస్థితి ఇలాగే వుందన్నారు. రానున్న రోజులలో ప్రజలు వైసిపికి బుద్దిచెప్పేందుకు సిద్ధంగా వున్నారన్నారు. రానున్న ఎన్నికలలో తెలుగుదేశం, జనసేనల ఐక్య అభ్యర్థులను గెలిపించుకొని రాష్ట్రంలో సుపరిపాలనకు సహకరించాలన్నారు. మాలేపాటితో పాటు టి డిపి నేతలు మన్నవ రవిచంద్ర, మొగిలి కల్లయ్య, బొట్లగుంట శ్రీహరినాయుడు, కాకి ప్రసాద్, షేక్ మ స్తాన్, జ్యోతిబాబురావు, గుత్తికొండ కిషోర్‌బాబు, మంచాల ప్రసాద్, పోతుగంటి శ్రీకాంత్, ద్రోణాదుల వెం కట్రావు, యం.ఎస్.గౌడ్, మక్కే శ్రీహరి, మహిళా నేత భవాని, జనసేన నేతలు రిష్‌కేష్, ఆలా శ్రీనాధ్, తిరుమలశెట్టి సుధీర్, సాధు శ్రీధర్, టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విమర్శలు గుప్పించారు.

## అల్లూరులో సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**అల్లూరు, నవంబరు 18 ప్రభాతవార్త** అల్లూరు రైతాంగానికి సాగునీటిని విడుదల చేసేందుకు శనివారం కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అల్లూరు చెరువులోని పల్లిపాడు తూము నుంచి నీరు విడుదల చేశారు. నెల్లూరులో ఇటీవల నిర్వహించిన ఐఎబి సమావేశంలో డెల్టా రైతాంగానికి సాగునీరు విడుదల చేయాలని అధికారులు, నాయకులు నిర్ణయం తీసుకోగా అందులో భాగంగా కావలి నియోజకవర్గంలోని డెల్టా ప్రాంతమైన అల్లూరు చెరువు వద్ద ప్రతాప్‌కుమార్‌రెడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లిపాడు తూము నుంచి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల అల్లూరుగా పేరుగాంచిన అల్లూరు మండలంలో పండించే వరి ధాన్యానికి ఎంతో ప్రాముఖ్యత వుందని తెలిపారు. డెల్టా రైతాంగానికి సాగునీటిని విడుదల చేయగా నాన్‌డెల్టా ప్రాంతమైన రైతాంగం ఆరుతడి పంటలను వేసుకోవాలని కోరారు. వైసిపి నగర కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నిమ్మల భాస్కర్, గుమ్మడి సురేంద్ర, దైవాదీనం, మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్లూరులో హిందూ ధర్మ ప్రచారం

**అల్లూరు, నవంబరు 18 ప్రభాతవార్త** అల్లూరులో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నవంబరు 18వ తేదిన మన ఆరాధ్య దైవమైన శ్రీరామచంద్రుని అయోధ్యలో నిర్మాణం పూర్తి చేసుకొని విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న శుభఘడియలు పురస్కరించుకొని దేశమంతటా గ్రామగ్రామాన ధార్మిక చైతన్యం కలిగించాలని హిందూ ధార్మిక ప్రచారం నిర్వహిస్తున్నామని భజన బృందాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో భజన గురువులు 16 మంది, సుమారు 560 మంది ప్రచారంలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



**సైదాపురం, నవంబర్ 18, ప్రభాతవార్త** మండల పరిధిలోని కలిచేడు గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు శనివారం ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు గూడూరు నుంచి పొదలకూరు వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు కలిచేడు గ్రామ సమీపంలో గుంతలమయంగా ఉన్న రోడ్డులో అదుపుతప్పి మార్జిన్ దాటి వెళ్లిపోయింది. దీంతో బస్సు కుదుపులకు ప్రయాణికులు ప్రాణభయందో ఆందోళన చెందారు. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. ప్రయాణికులంతా బస్సు దిగి సుమారు గంటసేపు రోడ్డుపై నిరీక్షణ చేశారు. గుంతలమయంగా ఉన్న రహదారిపై ప్రయాణం చేయాలంటేనే నరకయాతనగా ఉందని, త్వరగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## 29వ డివిజన్లో అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన



**నెల్లూరు సిటీ, నవంబర్18, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 29వ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్‌లోని వెంకటరెడ్డినగర్‌లో 60లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి నిర్మాణ పనులకు శనివారం కొబ్బరికాయ కొట్టి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీపై విసిగినపోయిన ప్రజలు



**నెల్లూరు నవంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** వైసీపీ నేతలు చేస్తున్న అరాచకాలు, దోపిడీలు, హత్యలు, దౌర్జన్యాలతో ప్రజలు విసిగిపోయారని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 45వ డివిజనులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు జెడ్ శివప్రసాద్ జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిపాలన లేదన్నారు. జగన్ ప్రభుత్వం చేస్తున్న పనులతో వేసారిపోయి టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబునాయుడు సీఎం అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్ట అజయ్, ఎద్దు మహేష్, మద్దెల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.